
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్

శుక్రవారం 21 ఫిబ్రవరి 2025

జిల్లాల వార్తలు





మెదక్ రాందాస్ చౌరస్తాలోని ట్రాఫిక్ సిగ్నల్

పోలీస్ వర్సెస్ ట్రాన్స్‌కో

- చలానా వేసినందుకు కరెంట్ సిబ్బంది కినుక
- ట్రాఫిక్ సిగ్నళ్లకు కరెంట్ సరఫరా కట్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల ఉద్యోగులైతే నిబంధనలు భేషుగ్గా ఉల్లంఘించవచ్చా? ఒకరి ఉల్లంఘనలను మరొకరు సహృదయంతో మన్నించాలనే రూల్స్ ఏమైనా ఉన్నాయా? ఏమో మెదక్‌లో విద్యుత్‌శాఖ సిబ్బంది తీరు ఇలాగే ఉంది. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ఒకే బైక్‌పై ముగ్గురు వెళ్తుండగా గమనించిన పోలీసులు నిబంధనల ప్రకారం జరిమానా విధించారు. దీనికి ప్రతిగా విద్యుత్ సిబ్బంది మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా, అంబేడ్కర్ సర్కిళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్లకు కరెంట్ సరఫరాను నిలిపివేశారు. ఈ నెల 14న, 17న పట్టణంలో ఘటన చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి రావడంతో చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగ విధుల్లో భాగంగా ఈ నెల 14న ముగ్గురు విద్యుత్ సిబ్బంది ఒకే బైక్‌పై వెళ్తుండగా ట్రాఫిక్ పోలీసులు రూ. 1,300 జరిమానా విధించారు. తిరిగి ఈ నెల 17న ఫైర్ యాక్సిండెంట్ కాల్ రాగా షిఫ్ట్‌లో ఉన్న ముగ్గురు విద్యుత్ సిబ్బంది ఒకే బైక్ వెళ్తుండగా మళ్లీ ఫైన్ వేశారు. ఈ విషయాన్ని ట్రాఫిక్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా చలానాలను సరిచేస్తామని వీరికి తెలిపారు. కాగా, అత్యవసర పనిపై వెళ్తున్నట్లు చెప్పినా రెండుసార్లు ఫైన్ వేస్తారా అంటూ విద్యుత్ సిబ్బంది కినుక వహించారు. పట్టణంలోని రాందాస్ చౌరస్తా, అంబేడ్కర్ సర్కిళ్లలో ట్రాఫిక్ సిగ్నళ్లకు 24 గంటల పాటు కరెంట్ సరఫరాను నిలిపివేశారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ నాగరాజు ట్రాఫిక్ చలానాలు సరిచేస్తామంటూ చెప్పినా కూడా సిగ్నళ్లకు కనెక్షన్ పునరుద్ధరించలేదు. విద్యుత్ అధికారులతో చర్చించిన అనంతరమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారని సీఐ తెలిపారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ నవీన్‌ను ఫోన్‌లో సంప్రదించగా ట్రాఫిక్ సిగ్నళ్లకు కరెంట్ మీటర్లు బిగించుకోవాలని తెలపడానికే కనెక్షన్ కట్ చేశామని, అనంతరం తిరిగి సరఫరాను పునరుద్ధరించామని వెల్లడించారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో మెదక్ పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

టూసెంట్ పరిశ్రమ ఆస్తులు జప్తు!

జిన్నారం, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ సహా పలు విదేశీ ఖాతాదారులకు డ్రగ్స్ ఎగుమతి చేసిన కేసులో ఈడీ అధికారులు సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని లూసెంట్ పరిశ్రమకు చెందిన రూ.5.67కోట్ల విలువైన ఆస్తులను తాత్కాలికంగా ఆటాచ్ చేసింది. పారిశ్రామికవాడలోని టూసెంట్ పరిశ్రమ నుంచి రెండేళ్ల క్రితం ట్రామడాల్ అనే డ్రగ్‌ను అక్రమంగా పాకిస్థాన్‌కు ఎగుమతి చేసినట్లు అప్పట్లో నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో కేసు నమోదు చేసింది. ఈ కేసులో విచారణ జరిపిన ఈడీ లూసెంట్ డ్రగ్స్ పరిశ్రమకు చెందిన భూమి, భవనం, ఇతర ప్రాంగణాలు మొత్తం రూ. 5.67 కోట్ల విలువైన ఆస్తులను తాత్కలికంగా ఆటాచ్ చేస్తూ హైదరాబాద్ జోనల్ కార్యాలయ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఘాటు తగ్గిన మిర్చి

- గణనీయంగా తగ్గిన ధర
- తగ్గిన దిగుబడి.. పెరిగిన పెట్టుబడి
- దిగాలు పడుతున్న రైతు
- ఇతర ప్రాంతాలకు తరలించినా గిట్టుబాటు కాని వైనం

మిర్చి ఘాటు తగ్గింది. గతేడాది భగభగలాడిన ధర.. ఈసారి గణనీయంగా తగ్గింది. వాతావరణ పరిస్థితుల కారణంగా ఈసారి దిగుబడి తగ్గింది. మరోవైపు పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగాయి. ఎంతో కష్టపడి సాగుచేసిన పంట చేతికి వచ్చే సమయంలో ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



జోగిపేట మార్కెట్‌లో ఓ మిర్చి దుకాణం

జోగిపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పరిధిలో అందోలు, చౌటకూరు, మునిపల్లి, హత్నూర, నారాయణఖేడ్ ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో వర్షాధారంగా మిర్చి సాగు చేసేవారు. మిర్చికి తెగుళ్ల బెడద పెరగడంతో కొన్నేళ్లుగా రైతులు పత్తి వైపు మొగ్గుచూపుతున్నారు. అయినా ఈసారి కూడా వెయ్యి ఎకరాలకు పైగా పంట వేసినట్లు అంచనా. వాతావరణ ప్రభావంతో తెగుళ్లు సోకడంతో పంట దిగుబడి తగ్గింది. పెట్టుబడి ఖర్చులు పెరిగాయి.

క్వింటాలుకు రూ. 6 వేలు పతనం

జిల్లాలో రైతులు తాము పండించిన మిర్చిని జోగిపేట, వట్‌పల్లి మార్కెట్ యార్డుల్లో విక్రయిస్తుంటారు. గతేడాదితో పోలిస్తే ఈసారి మిర్చ ధర క్వింటాలుకు రూ. 7 వేల వరకు తగ్గింది. గత సంవత్సరం క్వింటాలుకు అత్యధకంగా రూ.23 వేల వరకు పలికింది. ఈసారి మిర్చిలో మేలైన 273 రకం ఏ-గ్రేడ్ క్వింటాలుకు రూ. 15 వేలు మాత్రమే పలుకుతున్నది. ఆర్మూరు (బీ) రకం మిర్చి గతేడాది క్వింటాలుకు రూ. రూ. 18 వేలు ధర పలకగా.. ఈ సంవత్సరం రూ.12 వేలకు పడిపోయింది. పచ్చళ్లకు వాడే తేజ రకం మిర్చి గతేడాది క్వింటాలు రూ.16 వేలు పలుకగా.. ఈసారి కేవలం రూ.13 వేలు దాటలేదు.

ఎక్కడైనా ఇదే పరిస్థితి

గతేడాది ధరలు భారీగా పెరగడంతో ఈసారి రైతులు మిర్చి పంటపై ఆశలు పెట్టుకున్నారు. కానీ పంట చేతికొచ్చే సమయానికి ధరలు పడిపోవడంతో ఉసూరుమంటున్నారు. పెట్టుబడి, రవాణా ఖర్చులు పోగా కూలీ కూడా గిట్టుబాటు కావడంలేదని వాపోతున్నారు. జోగిపేట, వట్‌పల్లి మార్కెట్లలో ధరలు తగ్గడంతో కొందరు రైతులు వరంగల్‌లోని ఎనుమాముల మర్చి మార్కెట్‌కు, షోలాపూర్‌కు తరలించారు. కానీ అక్కడ కూడా ధర పెరగకపోగా రవాణా ఖర్చులు తడిసి మోపెడయ్యాయి. ధర పెరిగే వరకు నిల్వ ఉంచుకుందామనుకుంటే స్థానికంగా కోల్డ్ స్టోరేజీలు అందుబాటులో లేవు. దీంతో దిక్కుతోచని స్థితిలో రైతులు వచ్చిన ధరకే పంటను అమ్ముకుంటున్నారు. మిర్చి ధర పడిపోవడంతో వ్యాపారులూ నష్టపోతున్నారు. కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో పండిన పంట స్థానికంగా అవసరాలకు సరిపోకపోవడంతో వ్యాపారులు షోలాపూర్, అమరావతి, గుంటూరు నుంచి దిగుమతి చేసుకుని ఇక్కడ విక్రయించేవారు. కానీ ధరలు పడిపోవడంతో రవాణా చార్జీలు కూడా గిట్టుబాటు కావని జంకుతున్నారు.

వచ్చేసారి పంట వేయాలంటే భయమేస్తోంది



ఈసారి ఎండు మిర్చి ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. గత సంవత్సరం క్వింటాలుకు రూ.23 వేల వరకు విక్రయించాం. ఈసారి రూ.15 వేలు మాత్రమే ధర పలికింది. తెగుళ్లు, చీడపీడలు సోకడంతో పెట్టుబడులు పెరగడంతో పాటు దిగుబడి తగ్గిపోయింది. ఇక్కడ ధర తగ్గిపోయిందని వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు తరలించినా లాభం లేకపోయింది. రవాణా ఖర్చులు మీద పడ్డాయి. వచ్చేసారి పంట వేయాలంటే భయమేస్తోంది.

-కాల్వ నారాయణరెడ్డి, జోగిపేట

వచ్చిన కాడికి అమ్ముకున్నాం



మిర్చి పంట చేతికి రావడం ప్రారంభం కాగానే మార్కెట్‌లో ధరలు తగ్గిపోయాయి. సాధారణంగా సంక్రాంతి సమయంలో మిర్చి తెంపుతాం. ఆ సమయంలో ధర క్వింటాలుకు రూ. 15వేలు దాటలేదు. తీసిన పంటను ఇంట్లో ఉంచుకోలేక వచ్చిన కాడికి విక్రయించాం. పంట మొత్తం విక్రయించి చేలు బీడువారిన తరువాత ప్రస్తుతం ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ఇప్పుడు ధరలు పెరిగినా రైతులకు లాభం ఉండదు.

-నాగభూషణం, డాకూరు

ధర తగ్గడంతో ఆదాయం పడిపోయింది



గత ఏడాది కంటే ఈసారి ఎండు మిర్చి ధర భారీగా తగ్గింది. గతంలో చౌటకూరు, డాకూరు రైతుల నుంచి మిర్చిని కొని విక్రయించేవాళ్లం. ఇక్కడ పంట విస్తీర్ణం తగ్గిపోవడంతో కొన్నేళ్లుగా గుంటూరు, షోలాపూర్ నుంచి దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నాం. ఈసారి ధర క్వింటాలుకు రూ.7 వేల వరకు తగ్గడంతో దిగుమతి చేసుకుంటే గిట్టుబాటు కావడంలేదు.

-చింతకుంట భిక్షపతి, వ్యాపారి, జోగిపేట



గురక తగ్గించడానికి ఆపరేషన్ చేస్తే..

ప్రాణాలు పోయాయి !

- సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఘటన
- ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన
- డాక్టర్, యాజమాన్యంపై బాధితుల దాడి

7

భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త

- అనుమానంతో హత్య

7

భర్త హత్య కేసులో భార్య, అల్లుడి రిమాండ్

- బీమా కోసం ఘాతుకం


7



అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో ఆరుగురు ముఠా సభ్యులు
- రూ.4.50 కోట్ల విలువైన పల్లాడియం కార్బన్ స్వాధీనం

6



బీవీఆర్ఐటీలో ఈ-కార్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

బీవీఆర్ఐటీలో ఈ-కార్ రేస్ సందడి

బహాసే ఇండియా-25 పోటీలను ప్రారంభించిన రెనాల్ట్ నిస్సాన్ వైస్ ప్రెసిడెంట్ సిమోనా

తరలివచ్చిన 85 ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు

నర్సాపూర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థుల సృజనాత్మక ప్రదర్శనకు నిలయమైన బాహసే ఇండియా-25 ఈ-కార్ రేస్ పోటీలు మెదక్ జిల్లా నర్సాపూర్ బీవీఆర్ఐటీ కాలేజీలో గురువారం సందడిగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ కార్ల కంపెనీ రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ బిజినెస్ సెంటర్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ సిమోనా అడెలినా పోపోవిసి ప్రారంభించగా, గౌరవ అతిథులుగా బీపీసీఎల్ టెరిటరీ మేనేజర్ శ్రవణ్‌కుమార్, ఆటోకార్ ప్రొఫెషనల్ అసిస్టెంట్ ఎడిటర్ మయాంక్‌ధింగ్రా హాజరయ్యారు. ఈ పోటీలను అంతర్ కళాశాలల ఈవెంట్ సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజనీర్స్(ఎస్ఏఈ), శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో ఎస్ఏఈ బాహసే ఇండియాతో నిర్వహిస్తున్నది. దేశవ్యాప్తంగా యువఇంజనీర్ల ప్రతిభను ప్రోత్సహించే ఈ పోటీలకు 85 కాలేజీల నుంచి విద్యార్థుల బృందాలు తాము రూపొందించిన విద్యుత్ వాహనాలతో తరలివచ్చారు. ఈ సందర్భంగా సిమోనా మాట్లాడుతూ తమ సంస్థ భిన్నతత్వం, సమానత్వాన్ని ప్రోత్సహించడానికి నిబద్ధతతో ఉందన్నారు. బాహసే ఇండియా నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బాలరాజు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 2015లో 8 జట్లతో ప్రారంభమైన పోటీలకు ఇప్పుడు 85 జట్లు తరలివస్తున్నాయన్నారు. విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఆదిత్య మాట్లాడుతూ ఈ ప్రాతిష్ఠాత్మక కార్యక్రమానికి బీవీఆర్ఐటీ రెండోసారి వేదిక కావడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆటోలిన్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ శివకుమార్, బాహసే ఇండియా కన్వీనర్ వినోద్‌కుమార్, విష్ణు సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ తదితరులు హాజరయ్యారు.

నేటి నుంచి ఐఐటీహెచ్‌లో ఎలాన్-ఎన్‌విజన్ ఫెస్ట్

కంది, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో నేటి నుంచి ఎలాన్ ఎన్‌విజన్ 16వ ఎడిషన్ వార్షిక సాంస్కృతిక, సాంకేతిక వేడుకలు ప్రారంభం కాన్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 50వేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఇక్కడకు వచ్చి తమ ప్రతిభకు పదును పెట్టి సంస్కృతి, సాంకేతికల నూతన ఆవిష్కరణలతో పాటు రాక్‌బ్యాండ్, మ్యూజిక్ స్టేజీలతో ఆదరగొట్టనున్నారు. ఈసారి సాంస్కృతిక వేడుకలన్ని కోలాహలంగా జరగనున్నాయని ఐఐటీహెచ్ అధికారులు పేర్కొన్నారు. నేడు ఫ్యూజన్ నైట్ ప్రారంభోత్సవ వేడుకతో ప్రారంభమవుతుంది. రేపు ఇండీ నైట్ ఒక ప్రత్యేకమైన లైనప్‌ను కలిగి ఉంటుంది, వినూత్నమైన ఫ్లూట్ బీట్‌బాక్సింగ్, ఫ్లూట్‌బాక్సర్‌లు వారి అసాధారణమైన క్లాసికల్ ఫ్లూట్, కాంటెంపరరీ బీట్‌బాక్సింగ్ కలయికను ప్రదర్శిస్తాయి. 23న జరిగే గ్రాండ్ పాప్ నైట్, డీజే స్వాట్రిక్స్ ఎలక్ట్రానిక్ సంగీతం ఉంటుంది. ఈ సంవత్సరం టైటిల్ స్పాన్సర్‌గా గ్రీన్ కో, ఏఎమ్‌గ్రీన్‌కో సంస్థలు వ్యవహరించనున్నాయి.

నో హెల్మెంట్ నో ఎంట్రీ

ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పించడానికి మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ నడుంబిగించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ప్రధానద్వారం వద్ద బైకిస్టులను ఆపి హెల్మెట్ ఆవశ్యకతను వివరించారు.

-మెదక్ అర్బన్, (ఆంధ్రజ్యోతి)



రోగులతో మర్యాదగా వ్యవహరించాలి

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి : మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

చేగుంట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్య సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. గురువారం ఆయన చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీలను పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికను, ఓపీ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో అన్ని వార్డులను సందర్శించి సమస్యలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. రోగులతో ఓపికంగా మాట్లాడి అవసరమైన చికిత్స అందించాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఏలాంటి ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రంలోని పలు సమస్యలను వైద్యాధికారి అనిల్ కుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. జిల్లా వైద్యాధికారితో మాట్లాడి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనిఖీ సమయంలో డాక్టర్లు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండడంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తంచేశారు.

రైతుల ఫిర్యాదులను పరిష్కరించాలి

చిన్నశంకరంపేట: రుణమాఫీ, రైతు భరోసా వర్తించని రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించే విధంగా కృషి చేయాలని వ్యవసాయాధికారులకు కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. చిన్నశంకరంపేటలోని వ్యవసాయ పొలాలను గురువారం ఆయన సందర్శించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ రుణమాఫీ, రైతు భరోసా వర్తించని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. అర్హులైన రైతులకు పథకాలు వర్తించే విధంగా పరిష్కరించేందుకు వ్యవసాయ అధికారులు సహకరిస్తారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పంటలకు తెగులు సోకకుండా రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఏఈవోలు క్లస్టర్ రైతు వేదికలో రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం పొలంలో వరి కలుపు తీస్తున్న మహిళల వద్దకు వెళ్లి వారితో ముచ్చటించారు.

మున్సిపాలిటీల్లో 'బయోమైనింగ్'

- చెత్త నుంచి ఎరువుల తయారీ
- సంగారెడ్డి జిల్లాలో 10 పురపాలికల్లో ప్రయోగాత్మకంగా నిర్వహణ

ఐడీఏబొల్లారం ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో చెత్త డంపింగ్ సమస్యకు పరిష్కారం చూపడానికి ప్రభుత్వం బయోమైనింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. సంగారెడ్డి జిల్లాలోని 10 పురపాలక సంఘాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టనున్నారు. పట్టణీకరణ పెరగడంతో ఇందుకు అనుగుణంగా చెత్త డంపింగ్ సమస్య కూడా పెరుగుతున్నది. దీనిపై అధ్యయనం చేసిన రాష్ట్ర పురపాలకశాఖ బయోమైనింగ్ ద్వారా ఎరువుగా మార్చేందుకు చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం జీరో డంప్‌యార్డు లక్ష్యంతో చేపట్టిన స్వచ్ఛ భారత్ మిషన్ కింద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా సేకరించిన చెత్తను ప్రత్యేక యంత్రాల ద్వారా ఎరువుగా మార్చి వ్యవసాయం, ఇతర సంబంధిత రంగాల్లోని సంస్థలకు విక్రయిస్తారు. జిల్లాలోని ఐడీఏబొల్లారం, తెల్లాపూర్, ఖాజీపల్లి, అమీన్‌పూర్, జోగిపేట, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, నారాయణఖేడ్, ఇస్నాపూర్ పురపాలక పట్టణాల్లో వ్యర్థాలను బయోమైనింగ్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. దీనిపై పురపాలకశాఖ రాష్ట్రస్థాయి అధికారులు పర్యవేక్షించనున్నారు.



ఐడీఏబొల్లారంలో పేరుకుపోయిన వ్యర్థాలు



కాళ్లకల్ పెద్ద చెరువు కట్టుకాల్వ మాయం

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలోని పెద్దచెరువు కట్టుకాల్వ ఆనవాళ్లు కోల్పోతున్నది. 2 కిలోమీటర్ల పొడవైన కాల్వ ఎక్కడికక్కడ ఆక్రమణలకుగురైంది. 44వ జాతీయ రహదారి పక్కనే ఉండటంతో భూముల ధరలు రూ.కోట్లలో ఉండడంతో 33 అడుగు వెడల్పు ఉండే కాల్వను పరిశ్రమలు, వెంచర్ల యజమానులు ఆక్రమించారు. కట్టుకాల్వ లేకపోవడంతో వర్షాకాలంలో వరద నీరు చెరువులోకి వచ్చేందుకు మార్గం లేక పెద్దచెరువు నిండడంలేదు. ప్రభుత్వం, హైడ్రా దృష్టిసారించి కట్టు కాల్వను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

-మనోహరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి)

మల్లన్న ఆలయ హుండీ ఆదాయం రూ.78 లక్షలు

చేర్యాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం కానుకలు, ఒడిబియ్యం, హుండీ లెక్కింపులు చేపట్టారు. ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆలయ ముఖమండపంలో శ్రీలలితా సేవా ట్రస్ట్ సభ్యులు కరెన్సీ లెక్కించారు. రూ.78,31,047నగదు, 82 గ్రాముల బంగారం, 5.100 కిలోల వెండి మిశ్రమం, 13 క్వింటాళ్ల ఒడిబియ్యం, 130 విదేశీ కరెన్సీ నోట్లను భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇటీవల ఐదోవారం జాతర పూర్తవగా, వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తద్వా రా ఆలయంలో ఆయా హుండీలు నిండుతుండడంతో ఆలయాధికారులు లెక్కింపులు నిర్వహించారు. గత నెల 31న హుండీలు లెక్కించగా ఈ ఆదాయం కేవలం 19 రోజుల్లోనే సమకూరింది. కార్యక్రమంలో ధర్మకర్తలు కొప్పురపు జయప్రకాశ్‌రెడ్డి, మామిడాల లక్ష్మి, ఆలయ ఏఈవో, సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

● తల్లీబిడ్డ క్షేమం.. సంగారెడ్డి ఆస్పత్రికి తరలింపు

వట్‌పల్లి, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి) : గర్భిణీని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లోనే ప్రసవమై శిశువుకు జన్మనిచ్చిన సంఘటన గురువారం వట్‌పల్లి మండలంలో చోటుచేసుకున్నది 108 అంబులెన్స్ ఈఎంటీ దేవేందర్, పైలట్ మల్లేశం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొర్రేకల్ గ్రామానికి చెందిన ఉసిరిక పల్లి అనితకు నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. నొప్పులు ఎక్కువ కాగా, అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. అనిత మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు, వారిని సంగారెడ్డి ఆసుపత్రికి తరలించామని ఈఎంటీ తెలిపారు.



బిడ్డను చూపిస్తున్న ఈఎంటీ దేవేందర్

ప్రమాదవశాత్తు నీలగిరి తోట దగ్ధం

చిన్నకోడూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి నీలగిరి తోట (నీలగిరి చెట్లు) దగ్ధమైన సంఘటన చిన్నకోడూరు మండల పరిధిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గోనెపల్లికి చెందిన కూర రాజేందర్‌రెడ్డి, మాధవరెడ్డికి గ్రామ శివారులో 15 ఎకరాల నీలగిరి తోట ఉంది. బుధవారం అర్ధరాత్రి తోటలో ఒక వైపు మంటలు చెలరేగగా, తోట మొత్తం వ్యాపించాయి. గమనించిన చుట్టుపక్కల రైతులు ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వెంటనే ఫైర్ ఇంజన్‌తో ఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.



గోనెపల్లి శివారులో నీలగిరి తోటల్లో మంటలు

అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

● పోలీసుల అదుపులో ఆరుగురు
● రూ.4.50 కోట్ల విలువైన పల్లాడియం కార్బన్ స్వాధీనం

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఫార్మా కంపెనీల్లో పల్లాడియం కార్బన్ దొంగతనానికి పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను సంగారెడ్డి జిల్లా పోలీసులు, సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆరుగురిని అరెస్ట్ చేసి, రూ.4.50 కోట్ల విలువైన పల్లాడియం కార్బన్ స్వాధీనం చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ చెన్నూరి రూపేష్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 8న తేదీన సదాశివపేట పోలీస్‌స్టేషన్ పరిధి యావాపూర్‌లో అరీన్ లైఫ్ సైన్సెస్ యూనిట్-3 కంపెనీలో పల్లాడియం కార్బన్ చోరీ కాగా, ఆ కంపెనీ సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్ మజ్జి సూరప్పలనాయుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సదాశివపేట, సీసీఎస్ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం సదాశివపేట మండలం మద్దికుంట చౌరస్తాలో ఆరుగురు నిందితులను పట్టుకుని వారి నుంచి 96 కిలోల పల్లాడియం కార్బన్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు.

ముఠాగా ఏర్పడి దొంగతనాలు

నంద్యాల జిల్లా మహానంది మండలం మసీద్‌పురం గ్రామానికి చెందిన అల్లం సాంబశివుడు(43) ప్రస్తుతం హైదరాబాద్‌లోని సూరారంలో నివాసముంటున్నాడు. ఆయనతోపాటు మహారాష్ట్రలోని పూణే జిల్లా దేవల్లవడకు చెందిన ప్రసాద్ సాహేబ్ షిటోలే(24), మహారాష్ట్రలోని పటాస్‌కు చెందిన ఆదిత్య అంకుష్ మన్నె(23), సదాశివపేట మండలం యావాపూర్‌లోని ఆరేన్ లైఫ్ సైన్సెస్ యూనిట్-3 స్టోర్‌లో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్న తమ్మ ముక్కంటిరెడ్డి(47), హైదరాబాద్ చింతల్‌లోని వాణినగర్‌కు చెందిన మట్టా కుటుంబరావు(46), గాజులరామారానికు చెందిన కెమికల్ వ్యాపారి గుమ్మడి శ్రీనివాస్‌రావు(47) ముఠాగా ఏర్పడ్డారు. అల్లం సాంబశివుడు గతంలో పూణేలో ఫార్మా కంపెనీలో పనిచేసే సమయంలో ప్రసాద్, అమోల్ జాగడే(రాజు)తో పరిచయం ఏర్పడింది. పూణేలో పని మానేసిన సాంబశివుడు హైదరాబాద్‌కు వచ్చి పల్లాడియం కార్బన్ లభించే ఫార్మా కంపెనీల గురించి ఆరా తీశాడు. కంపెనీల్లో పనిచేసే స్టోర్ సిబ్బందికి డబ్బు ఆశ చూపి సమాచారం సేకరించేవాడు. సాంబశివుడు ఈ విషయాన్ని ప్రసాద్‌కు, అమోల్ జాగడే టీంకు తెలియజేసేవాడు. 2023లో సాంబశివుడు అమోల్ జాగడే అతని గ్యాంగ్ సభ్యులు గుమ్మడిదల పోలీస్‌స్టేషన్, బొంతపల్లిలో గల న్యూలాండ్ కంపెనీలో 35 కిలోల పల్లాడియం కార్బన్ దొంగతనం చేశారు. 2024 నవంబరులో అమోల్ జాగడే గ్యాంగ్ బొల్లారంలోని రాంప్యాక్స్ కంపెనీలో 8 కిలోలు, 2024 డిసెంబరులో ప్రసాద్, అతని గ్యాంగ్ సభ్యులు బీదర్‌లోని సాయిలైఫ్ సైన్సెస్‌లో 17 కిలోల వరకు పల్లాడియం కార్బన్ దొంగతనం చేశారు. 20 రోజుల క్రితం సాంబశివుడు సదాశివపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని యావాపూర్‌లో అరీన్ లైఫ్ సైన్సెస్ యూనిట్ 3 గురించి తెలుసుకొని, స్టోర్ మేనేజర్ ముక్కంటిరెడ్డికి డబ్బు ఆశ చూపి మెటీరియల్ పూర్తి వివరాలు తెలుసుకుని ప్రసాద్‌కు తెలియజేశాడు. ఈ నెల 8వ తేదీన ప్రసాద్ అతని గ్యాంగ్ సభ్యులు కంపెనీలో 120 కిలోల పల్లాడియం కార్బన్ దొంగిలించారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రూపేష్ వెల్లడించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, సీఐలు మహేష్‌గౌడ్, శివకుమార్, రామునాయుడు, శ్రీకాంత్ పాల్గొన్నారు.



నిందితులు, స్వాధీనం చేసుకున్న పల్లాడియం కార్బన్‌ను చూపుతున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్, సీసీఎస్ పోలీసులు

రాజీ కుదిర్చేలా అవగాహన కల్పించాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో ఇరు వర్గాలను రాజీపడేలా అవగాహన కల్పించాలని, మార్చి 8వ తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి గురువారం ఆయన పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాజీకి అవకాశం ఉన్న కేసులన్నీ పరిష్కరించాలన్నారు. అలాగే సైబర్ నేరాలకు సంబంధించి బాధితులు కోల్పోయిన డబ్బును తిరిగి ఇప్పించడానికి సంబంధిత బ్యాంకు అధికారులకు కోర్టు ద్వారా ఉత్తర్వులు అందించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ విజయకృష్ణ, కోర్టు లైజనింగ్ అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

తప్పుడు ప్రచారం చేస్తే ఉపేక్షించేది లేదు : ఎస్పీ

మునిపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : బాలిక మృతిపై తప్పుడు ప్రచారాలు చేస్తే ఎంత వారినైనా ఉపేక్షించేది లేదని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ హెచ్చరించారు. ఈనెల 11న మునిపల్లి మండలం అంతారం గ్రామంలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘటనలో గ్రామానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్ కుమార్తె(15) గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో 16న మృతి చెందింది. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్‌తో కలిసి అంతారం గ్రామాన్ని ఎస్పీ రూపేష్ గురువారం సందర్శించారు. ఇస్మాయిల్ ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మృతికి కారుకులైన వీరారెడ్డి, విజయ్‌రెడ్డిని ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితులకు ఎలాంటి వ్యక్తిగత కక్షలేదని, ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా భావించాలన్నారు. చదువుకునే విద్యార్థి మృతి చెందడం కుటుంబంలో తీరని లోటు అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తనతో మాట్లాడొచ్చని ఇస్మాయిల్ కుటుంబానికి సూచించారు. ఎస్పీ వెంట కొండాపూర్ సీఐ వెంకట్, మునిపల్లి ఎస్ఐ రాజేష్‌నాయక్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇసుక ఫిల్టర్‌పై పోలీసుల దాడులు

● 2 ట్రాక్టర్లు, హిటాచీ, మూడు బైకులు స్వాధీనం

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నక్కవాగు వద్ద ఇసుక ఫిల్లర్‌పై పోలీసులు దాడులు చేశారు. వివరాల్లోకి వెళితే.. నక్కవాగు పరిసర ప్రాంతాల్లో బ్యాతోల్ తండా వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించినట్టు సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారని పేర్కొన్నారు. ఘటనా స్థలంలో రెండు ట్రాక్టర్లు, ఒక హిటాచీ, మూడు బైకులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

గుప్తనిధులు తవ్వుతున్న ముగ్గురి పట్టివేత

మనోహరాబాద్ ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : గుప్త నిధుల కోసం తవ్వుతుండగా గ్రామస్థులు పట్టుకున్న ఘటన మండల పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలం లింగారెడ్డిపేట్ గ్రామంలో త్రిపురం వెంచర్‌లో హైదారాబాద్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వుతున్నారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న గ్రామస్థులు వారిని అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం అందించగా, వెంటనే అక్కడికి చేరుకుని ముగ్గురిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి


పిట్ల కృష్ణ (ఫైల్)

రాయపోల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఎల్కల్ గ్రామానికి చెందిన పిట్ల కృష్ణ(40)కు భార్య లలిత, కూతురు, కుమార్తె ఉన్నారు. కృష్ణ తనకున్న పొలంతో పాటు గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం పొలం వద్ద బోరుమోటారు నడవకపోవడంతో రిపేరు చేయాలనుకున్నాడు. దీని కోసం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. గమనించిన చుట్టుపక్కల వారు, కుటుంబసభ్యులు కృష్ణను ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. కృష్ణ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సంఘటనతో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. గ్రామంలో విషాదం అలుముకున్నది.

సీలింగ్ ఫ్యాన్ మరమ్మతు చేస్తుండగా మరొకరు..


పొట్టినోళ్ల నర్సింహులు(ఫైల్)

రామాయంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ మరమ్మతు చేసే క్రమంలో విద్యుదాఘాతంతో ఒకరు మృతిచెందిన సంఘటన రామాయంపేట మండల పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని లక్ష్మాపూర్‌లో గ్రామానికి చెందిన పొట్టినోళ్ల నర్సింహులు(55) ఇంట్లో ఫ్యాన్ తిరగకపోవడంతో తనే మరమ్మతు చేస్తున్నాడు. కరెంటు సరఫరా ఉండగానే ఫ్యాన్ బిగిస్తున్న సమయంలో వైర్లు చేతికి తగిలి ఒక్కసారిగా స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన భార్య లక్ష్మి చుట్టుపక్కల వారి సహాయంతో నర్సింహులును రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే నర్సింహులు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

సంగారెడ్డి జీజీహెచ్ ఎదుట
గుర్తుతెలియని ఇద్దరి మహిళల మృతి

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్) ఎదుట గుర్తుతెలియని ఇద్దరు మహిళలు మృతిచెందినట్టు సీఐ ఎస్.రమేష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఇద్దరు మహిళలు కొన్నాళ్లుగా సంగారెడ్డి జీజీహెచ్ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ జీవించే వారు. రాత్రి సమయంలో ఆస్పత్రి ఎదుట ఉన్న జనరిక్ మెడికల్ స్టోర్ ముందు పడుకునే వారు. అయితే, గురువారం మధ్యాహ్నం సమయంలో జీజీహెచ్ క్యాజువాలిటీ ఎదుట వీరిద్దరూ చనిపోయి కనిపించారు. ఆస్పత్రి సెక్యూరిటీ గార్డ్ ఇన్‌చార్జి జాన్, సెక్యూరిటీ వార్డు బాయ్ కల్పగూరి ఆంజనేయులు పోలీసులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ రమేష్ పేర్కొన్నారు. అనారోగ్య కారణంతో మరణించి ఉండవచ్చని సీఐ తెలిపారు.

భర్త హత్య కేసులో భార్య, అల్లుడి రిమాండ్

● బీమా డబ్బు కోసం ఘాతుకం


నిందితులను చూపుతున్న పోలీసులు

పాపన్నపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : భర్తకు సేవ చేయలేక అల్లుడి సహాయంతో హత్య చేసి సహజ మరణంగా చిత్రీకరించడానికి ప్రయత్నించిన ఇద్దరి నిందితులను రిమాండుకు తరలించినట్లు మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గురువారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. పాపన్నపేట మండల పరిధిలోని బాచారం గ్రామానికి చెందిన కర్రెల్ల ఆశయ్య ఈ నెల 15న వ్యవసాయ క్షేత్రంలో కాలు జారి పడడంతో నడుం తుంటి వద్ద విరిగింది. వైద్య ఖర్చుల నిమిత్తం డబ్బు వెచ్చించాల్సి వస్తుందని అంతమొందిస్తే సమస్య తీరడంతో పాటు బీమా డబ్బు వస్తుందని ఆశతో ఈనెల 17న రాత్రి ఆశయ్య నిద్రిస్తున్న సమయంలో భార్య శివమ్మ, అల్లుడు రమేష్ సహాయంతో గొంతుకు టవల్ బిగించి హత్య చేశారు. అనంతరం సహజ మరణంగా చిత్రీకరించేందుకు ప్రయత్నం చేశారు. గ్రామస్థులు మృతుడి గొంతుపై ఘాట్లు చూసి మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. ఆశయ్య సోదరి గంగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేయగా అల్లుడు రమేష్ సహాయంతో భార్య శివమ్మ హత్య చేసినట్లు తేలింది. ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గుర్తు తెలియని కారు ఢీకొని 12 గొర్రెలు మృతి

● గొర్రెల కాపరికి స్వల్ప గాయాలు

కొల్చారం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని కారు ఢీకొని.. 12 గొర్రెలు మృతిచెందగా, గొర్రెల కాపరికి స్వల్ప గాయాలైన సంఘటన కొల్చారం మండల పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం మెదక్ పట్టణానికి చెందిన వెంకయ్య, శ్రీశైలం ఇద్దరు కలిసి చిన్నగనాపూర్ నుంచి రాత్రిపూట మెదక్‌కు గొర్రెలను కొట్టుకొని వస్తున్నారు. కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి శివారు హనుమాన్ బండలు వద్ద గుర్తుతెలియని కారు ఢీకొనడంతో 12 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెల కాపరి వెంకయ్యకు స్వల్ప గాయలయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కోనాపూర్ సొసైటీలో నిధుల
గోల్‌మాల్‌పై విచారణ

రామాయంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోనాపూర్ సొసైటీలో నిధుల గోల్‌మాల్‌పై గురువారం అధికారులు విచారణను ప్రారంభించారు. కోనాపూర్ సొసైటీ గత చైర్మన్ అయిన మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి భర్త దేవేందర్‌రెడ్డి హయాంలో రూ.2 కోట్ల పైచిలుకు నిధులు విషయంలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. ఇంతకాలం నిశ్శబ్దంగా ఉన్న సహకార శాఖ ఎట్టకేలకు దీనిపై విచారణను వేగవంతం చేశారు. సొసైటీ కార్యాలయంలో కో-ఆపరేటివ్ శాఖ జిల్లా అధికారి అంజియా డైరెక్టర్లతో వేర్వేరుగా మాట్లాడి వివరాలను సేకరించారు. నాలుగు రోజుల పాటు దీనిపై విచారణ కొనసాగనున్నట్లు తెలిసింది. గత పాలకవర్గం, కార్యాలయ సిబ్బందిని ప్రశ్నించి మరిన్ని వివరాలు సేకరించనున్నట్లు సమాచారం. అన్ని కోణాల్లో విచారణ జరిపి నిధుల అవకతవకలపై నిగ్గు తేల్చనున్నారు.

విచారణకు కలెక్టర్ ఆదేశం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కంగ్టిలోని గిరిజన గురుకుల కళాశాల వసతి గృహంలో విద్యార్థులతో టిఫిన్స్ చేయించడమే కాకుండా ఇతర పనులు చేయించడంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఈ మేరకు హాస్టల్ సిబ్బందిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తిని ఆమె ఆదేశించారు.

భళా బాలక

కిలిమంజారో, పాతాల్సు పర్వతాలను అధిరోహించిన హనుమతండావాసి

బాలుడికి వాచ్ గిఫ్ట్ ఇచ్చి అభినందించిన గవర్నర్



కిలిమంజారో పర్వతంపై విహన్‌రామ్

దూళిమిట్ట, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి) : చిన్న వయసులోనే అత్యంత కష్టమైన పర్వతారోహణ చేస్తూ ఔరా అనిపిస్తున్నాడు దూళిమిట్ట మండలం హనుమతండాకు చెందిన తొమ్మిదేళ్ల బాలుడు విహన్‌రామ్. ప్రస్తుతం విహన్‌రామ్ మంచిర్యాల జిల్లాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఆఫ్రికా ఖండంలోని టాంజానియా దేశంలో ఉన్న 5,685 మీటర్ల ఎత్తైన కిలామంజారో పర్వతాన్ని, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం మనాలిలోని 4,250 మీటర్ల ఎత్తైన పాతాల్సు పర్వతాన్ని అధిరోహించి తెలంగాణ రాష్ట్రంలోనే అతి చిన్న వయస్సులో తక్కువ సమయంలో పర్వతరోహణ చేసిన బాలుడిగా రికార్డును విహన్‌రామ్ సొంతం చేసుకున్నాడు. పర్వతరోహణకు బాలుడి గురువు మహిపాల్‌రెడ్డి, తండ్రి తిరుపతినాయక్‌ను తీసుకువెళ్తుంటాడు. విహన్‌రామ్ గురించి తెలుసుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బాలుడిని గత నెల 28న గవర్నర్ కార్యాలయానికి పిలిపించుకొని అభినందించి వాచ్‌ను బహూకరించారు.

ఏడు ఖండాలలోని పర్వతాలను అధిరోహించడమే లక్ష్యం

కోచ్ మార్గదర్శకత్వంలో, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో రానున్న రోజుల్లో ఏడు ఖండాలలో ఉన్న పర్వతాలను అధిరోహించాలని ఉంది. ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డును అందుకోవడమే నా లక్ష్యం. అంతర్జాతీయ శిఖరాలపై భారతదేశ ఖ్యాతిని ఎగురవేయడమే నా ఆకాంక్ష.

- విహన్‌రామ్

ప్రభుత్వం సహకారం అందించాలి

నేను ఆబ్కారీశాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాను. పేదరికాన్ని చవిచూసి వచ్చిన నాకు.. నా కుమారుడు అంతర్జాతీయంగా పర్వతారోహణ చేయడం చాలా ఆనందంగా ఉంది. ప్రభుత్వాలు సహకారం అందిస్తే ఇంకా ఎక్కువ రికార్డులను సాధించే అవకాశం ఉంది. త్వరలో ఆస్ట్రేలియాలోని మౌంట్ కోసియాస్కో పర్వతారోహణకు వెళ్లనున్నాడు.సహకరిస్తున్న హర్యానా క్యాడర్ ఐఎఫ్ఎస్ గుగులోత్ రామాన్‌కు, మంచిర్యాలకు చెందిన డాక్టర్ విద్యకు ధన్యవాదాలు.

- తిరుపతి నాయక్, విహన్‌రామ్ తండ్రి

కళావిహీనంగా తయారైన ఆ సర్కారు పాఠశాలలు దాతల సహకారంతో సరికొత్త కళను సంతరించుకున్నాయి. పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకున్న ముస్త్యాల పాఠశాల భవనానికి ఓ ఎన్ఆర్ఐ మరమ్మతులు చేయించి.. రంగులు వేయించి మౌలిక వసతులను సమకూర్చారు... నిర్వహణ సరిగ్గా లేక పాడుబడిన నంగునూరు ప్రాథమిక పాఠశాలను ప్రధానోపాధ్యాయుడి కృషితో రూపురేఖలను మర్చారు.


ఎన్ఆర్ఐ ప్రతాప్‌రెడ్డి ఇటీవల రంగులు వేయించిన ముస్త్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

పాఠశాలలకు సరికొత్త రూపు

ఎన్ఆర్ఐ చొరవతో సుందరీకరణకు నోచుకున్న ముస్త్యాల బడి

కోతుల బెడద నివారణకు ఇనుప గ్రిల్స్ బిగింపు

విద్యార్థుల సంక్షేమం కోసం రూ.5 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్

హెచ్ఎం కృషి.. దాతల సహకారంతో నంగునూరు పాఠశాలకు మెరుగులు

చేర్యాల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు పెడుతల ప్రతాప్‌రెడ్డి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల అభ్యున్నతికి పాటుపడుతూ విద్యాభిమానాన్ని చాటుకుంటున్నాడు. తన సొంత ఖర్చుతో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటూ కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. తద్వారా పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయి.

గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1-5వ తరగతి వరకు 110మంది విద్యార్థులు ఉన్నారు. చాలాయేళ్ల క్రితం నాలుగు గదులతో కూడిన భవనం నిర్మించినా శిథిలావస్థకు చేరుకుని పలుచోట్ల పెచ్చులూడిపోతున్నాయి. ఉన్న నాలుగు గదులు సరిపడకపోవడంతో వరండాలో విద్యార్థులను కూర్చోబెట్టి తరగతులు నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా కోతులు స్వైరవిహారం చేస్తుండటంతో భయాందోళన చెందుతున్నారు. విద్యార్థులకు ఆట, పోటీల నిర్వహణ, ఇతరత్రా కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులుపడుతున్నారు. ఆయా అంశాల పరిగణనదృష్ట్యా పాఠశాల అవసరాల నిమిత్తం శాశ్వత ఆదాయ వనరుల కల్పనపై దృష్టి సారించాడు ఎన్ఆర్ఐ పెడుతల ప్రతాప్‌రెడ్డి. కొన్నాళ్ల క్రితం రూ.5లక్షలు నగదు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ప్రతీనెలా సమకూరే వడ్డీ డబ్బుతో విద్యార్థులకు ఉపయోగకర పనులు చేస్తున్నారు. పాఠశాల భవనం ఇటీవల పెచ్చులూడిపోవడంతో రూ.1.50లక్షల వ్యయంతో మరమ్మతులు నిర్వహించి రంగులు వేయించారు. కోతుల బెడద నివారణతో పాటు తరగతి గదుల కొరత నివారణకు వరండా ప్రదేశంలో రూ.50వేల వ్యయంతో ఇనుప గ్రిల్ ఏర్పాటు చేయించారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రార్థన, తదితర కార్యక్రమాల నిర్వహణకు సౌండ్ సిస్టమ్ ఇచ్చారు. పాఠశాల అవసరాల నిమిత్తం లేజర్‌జెట్ ప్రింటర్‌ను సమకూర్చారు. తాగునీటి సమస్య పరిష్కారానికి నల్లాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. దీంతో పాఠశాల రూపురేఖలు మారిపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆయన సేవలను కొనియాడుతున్నారు.


ప్రింటర్‌ను అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

విద్యతోనే వివేకం

విద్యతతోనే వివేకం, జ్ఞానం కలుగుతుంది. మా గ్రామంలోని విద్యార్థులు ఇబ్బందులు పడకుండా నాణ్యమైన విద్యపొందాలన్న లక్ష్యంతో పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాను. క్రమశిక్షణ అలవర్చుకుని చదువుకుంటూ ఉన్నత స్థానానికి ఎదిగి గ్రామానికి, తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని నావంతు చిరు ప్రయత్నం చేస్తున్నా.

- పెడుతల ప్రతాప్‌రెడ్డి, ఎన్ఆర్ఐ

ప్రభుత్వ నిధులు కోసం చూడకుండా


ప్రధానోపాధ్యాయుడు జయపాల్‌యాదవ్

నంగునూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిధులు కోసం ఎదురు చూడకుండా దాతల సహకారంతో పాఠశాల రూపురేఖలే మార్చారో ప్రధానోపాధ్యాయుడు. నంగునూరులోని బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న పయ్యావుల జయపాల్‌యాదవ్ కృషితో ఆ బడి సరికొత్త రూపును సంతరించుకున్నది. 8 నెలల కిందట ఈ పాఠశాలలో ఉద్యోగ బాధ్యతలు తీసుకున్న జయపాల్‌యాదవ్ ఉన్న వనరులను ఉపయోగించుకుని దాతల సహకారంతో ఆరు నెలల్లోనే పాఠశాల రూపురేఖలే మార్చారు.

వర్షం కురిసినప్పుడు పాఠశాలలో అడుగు మేర నిలిచే నీరుతో తరగతి గదుల్లోకి వెళ్లడానికి విద్యార్థులు ఇబ్బంది పడేవారు. ముందుగా పాఠశాల ఆవరణలో నీళ్లు నిలవకుండా చేసేందుకు స్వయంగా పలుగు, పార చేత పట్టి శ్రమదానం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారంతో పాఠశాల ఆవరణ చదును చేశారు. పచ్చదనం పరిశుభ్రత పేరిట పాఠశాల ఆవరణను పూర్తిగా శుభ్రం చేశారు. తరగతి గదుల్లో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగింపజేశారు. నిధుల కొరతతో అర్ధాంతరంగా ఆగిపోయిన వంటగది ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను జయపాల్‌యాదవ్ స్వయంగా తొలగించారు. గతంలో ఈ స్థలంలో గొర్రెలను తోలేవారు. వారితో మాట్లాడి ఇక్కడకు గొర్రెలను తీసుకురాకుండా చర్యలు తీసుకున్నారు. గోడలకు రంగులు వేయించడంతోపాటు వాటిపై అందమైన బొమ్మలు గీయించి, సూక్తులు రాయించారు. పాఠశాలకు ఆవరణకు ప్రహరీ లేకపోవడంతో నర్సరీ నుంచి తన ద్విచక్రవాహనంపై మొక్కలను తెచ్చి నాటించారు. మొక్కలకు రక్షణగా, ఆవరణకు ప్రహరీలా ట్రీ గార్డులను ఏర్పాటు చేశారు. అర్ధాంతరంగా ఆగిపోయిన వంటగదిని మిత్రుడి సహాయంతో అమెరికాలోని బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధిని పూర్తిచేయించారు. పాఠశాలకు టీవీ, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను వారి ద్వారా సమకూర్చారు. సతీశ్ అనే దాత సహకారంతో పాఠశాల ప్రధాన గేటు నిర్మింపజేశారు. నంగునూరుకు చెందిన శనిగరం కనకయ్య అందించిన ఆర్థిక సాయంతో మధ్యాహ్న భోజన ప్లేట్లు అందించారు. పాఠశాలలో దేశ నాయకుల చిత్రపటాలను దాతలు అందించిన ఆర్థిక సహాయంతో పెట్టించారు. బడిని గుడిలా చూడాలి అనే సిద్ధాంతంతో ప్రధానోపాధ్యాయుడు పయ్యావుల జయపాల్‌యాదవ్ నంగునూరు పాఠశాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు.



నంగునూరు బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల

గురక ట్రీట్మెంట్‌కు వెళ్తే.. ప్రాణాలు పోయాయి!

సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఘటన

ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన

ఆస్పత్రి డాక్టర్, యాజమాన్యంపై బాధితుల దాడి


శ్రీనివాస్(ఫైల్)


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గురక సమస్యతో ఆస్పత్రిలో చేరిన వ్యక్తికి ముక్కులో శస్త్ర చికిత్స చేసిన కొన్ని గంటల వ్యవధిలోనే గుండెపోటు రావడంతో మృతిచెందాడు. డాక్టర్ నిర్లక్ష్యంతోనే చనిపోయాడంటూ కుటుంబసభ్యులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించిన ఘటన గురువారం సంగారెడ్డిలో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు, ఆస్పత్రి వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గారకుర్తి గ్రామానికి చెందిన వి.శ్రీనివాస్(42)కు నిద్రలో తరచూ గురక వస్తుండడంతో చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో బుధవారం చేరారు. ముక్కులో ఎముక పెరిగిందని, ఆపరేషన్ చేయాలని కానీ మోడరేట్ రిస్క్ ఉంటుందని డాక్టర్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. డాక్టర్లు ఆపరేషన్ చేసిన తర్వాత పేషెంట్‌ను ఐసీయూకు తరలించారు. బుధవారం అర్ధరాత్రి 2 గంటలకు పేషెంట్ శ్రీనివాస్‌కు ఆకస్మాత్తుగా గుండెపోటు రావడంతో చనిపోయాడు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఎలా చనిపోతారని కుటుంబసభ్యులు ఆరోపించారు. ఆస్పత్రి ఎదుట ప్రధాన రహదారిపై శ్రీనివాస్ కుటుంబసభ్యులు, బంధువులు బైఠాయించి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్ పోలీసులతో ఆస్పత్రి వద్దకు చేరుకుని మాట్లాడి పరిస్థితిని అదుపు చేశారు. వైద్యుడి నిర్లక్ష్యంతోనే శ్రీనివాస్ మృతి చెందాడని, తమకు న్యాయం చేయాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. స్పందించిన ఆస్పత్రి యాజమాన్యం మానవతా దృక్పథంతో ఆర్థిక సాయంగా రూ.3 లక్షలు, కట్టిన ఆస్పత్రి బిల్లు రూ.60 వేలు తిరిగి ఇచ్చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించి శ్రీనివాస్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు శ్రీనివాస్ అన్న నాగేందర్ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆస్పత్రి వైద్యుడు, యాజమాన్యంపై దాడి

అంతా సద్దుమణింగిందని అందరూ ఊపిరిపీల్చుకున్న తరుణంలో ఇంతలోనే పేషెంట్ శ్రీనివాస్ కుటుంబసభ్యులు కొందరు ఒక్కసారిగా ఆస్పత్రిలోనికి చొచ్చుకొచ్చారు. సర్జరీ చేసిన ఈఎన్‌టీ వైద్యులు శ్యామ్‌మనోహర్‌తో పాటు ఆస్పత్రి నిర్వహకుడు రాజుపై దాడి చేశారు. దాడిని నిలువరిస్తున్న క్రమంలో సివిల్‌లో ఉన్న కానిస్టేబుల్ షర్ట్ కూడా చినిగిపోయింది. పట్టణ సీఐ రమేశ్ ఆస్పత్రికి చేరుకొని పలువురుని లాఠీతో చెదరగొట్టారు. తాము ఏం చేశామని కొడుతున్నారని పోలీసులపై పలువురు వాగ్వాదానికి దిగారు. డీఎస్పీ సత్తయ్యగౌడ్ మరోమారు అక్కడికి చేరుకుని పరిస్థితిని ఆరా తీశారు.




హైవేపై కూలిన ఎలక్ట్రిక్ హోర్డింగ్

ఇద్దరికి గాయాలు

కామారెడ్డిలో జరిగే మిత్రుడి వివాహానికి కారులో వెళుతూ తూప్రాన్ పట్టణ పరిధి ఇమాంపూర్ శివారులో 44వ జాతీయ రహదారిపై ఆగి రూట్‌మ్యాప్ చెక్ చేసుకుంటున్నాడు. ఆ సమయంలో హైదరాబాద్ వైపు నుంచి బోధన్‌కు వెళ్తున్న డీసీఎం కారును ఢీకొని పక్కనే ఉన్న ఎలక్ట్రిక్ హోర్డింగ్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఎలక్ట్రిక్ హోర్డింగ్ కూలిపోయి కారుపై పడటంతో కారులో ప్రయాణిస్తున్న హైదరాబాద్‌కు చెందిన గడిపూడి ప్రత్యూష(25)గాయపడింది. డీసీఎం డ్రైవర్ మహ్మద్ అలీం సైతం గాయపడగా ఆసుపత్రికి తరలించారు.

తూప్రాన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి)

అనుమానంతో
భార్యను గొడ్డలితో నరికిన భర్త


లక్ష్మి(ఫైల్)

నారాయణఖేడ్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): భార్యను భర్తే గొడ్డలితో నరికి హతమార్చిన సంఘటన సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం తుర్కవడగాంలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కంగ్టి మండలం తుర్కవడగాంకు చెందిన హెబాలే గుండప్ప(55), లక్ష్మి అలియాస్ చంద్రమ్మ భార్యభర్తలు. 30 ఏళ్లుగా కాపురం చేస్తుండగా, వీరికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. పెద్ద కూతురు వివాహం కాగా, మిగతా ముగ్గురు చదువుకుంటున్నారు. ఇంటి వద్ద గుండప్ప, ఆయన భార్య లక్ష్మి ఉంటారు. కొన్ని రోజులుగా గుండప్ప భార్యపై అనుమానం పెంచుకుని తరచూ గొడవపడేవాడు. ఇటీవల గ్రామ పెద్దలు పంచాయితీ నిర్వహించి, ఇద్దరి మధ్య సయోధ్య కుదుర్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి మద్యం తాగొచ్చిన గుండప్ప లక్ష్మితో గొడవపడ్డారు. తెల్లవారుజామున గుండప్ప ఆమెపై గొడ్డలితో దాడిచేయడంతో తలపై తీవ్ర గాయాలయ్యాయి. ఆమె బయటకు పరిగెత్తుతున్న క్రమంలో ఇంటి ముంగిట్లో పడిపోయి చనిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో చుట్టుపక్కల వారు గుండప్పను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కంగ్టి ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సిద్దిపేటలో యువకుడి హత్య


శ్రీనివాస్(ఫైల్)

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : యువకుడు హత్యకు గురైన సంఘటన సిద్దిపేటలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. తొగుట మండలం పెద్దమాసంపల్లి గ్రామానికి చెందిన బోదాసు శ్రీనివాస్(35) కరీంనగర్, హైదరాబాద్‌లలో కూలి పని చేస్తూ జీవిస్తుంటాడు. శ్రీనివాస్ తల్లికి సిద్దిపేట కేసీఆర్‌నగర్‌లో డబుల్‌బెడ్రూం రావడంతో అప్పుడప్పుడు ఇక్కడికి వచ్చి వెళుతూ ఉంటాడు. ఈ క్రమంలో సిద్దిపేట నర్సాపూర్ రోడ్డులోని మైసమ్మ ఆలయం వద్ద నిర్మాణంలో ఉన్న ఇంటిలో గురువారం ఉదయం శ్రీనివాస్ మృతిచెంది కనిపించగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే టూటౌన్ పోలీసులు చేరుకుని క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్స్ సహాయంతో ఆధారాలను సేకరించారు. శ్రీనివాస్‌ను తలపై సెంట్రింగ్ కట్టెతో బలంగా కొట్టి చంపి ఉంటారని ప్రాథమిక విచారణలో తేలినట్లు సిద్దిపేట ఏసీపీ మధు తెలిపారు. శ్రీనివాస్ బుధవారం రాత్రి ఒక వ్యక్తితో మద్యం సేవించి ఘర్షణ పడినట్లు తెలిసిందని పేర్కొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై మాట తప్పిన కాంగ్రెస్

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఉచితంగా ఎల్ఆర్ఎస్‌ను చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ తాజాగా మాట తప్పిందని సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆరోపించారు. సంగారెడ్డిలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌పై చేస్తున్న ప్రకటనలు ప్రజలను అయోమానికి గురి చేస్తుందన్నారు. మార్చి 31లోగా ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకుంటే 25 శాతం రాయితీ ఇస్తామని చెప్పడం ప్రజలను వంచించడమేనని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలన అర్థంకాక, ప్రజలు ఆగమాగం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడం లేదన్నారు. సమావేశంలో నాయకులు ప్రభాకర్, నర్సింహులు, శ్రీనివాస్, విఠల్, ముఖ్తార్ తదితరులు పాల్గొన్నారు.



పరిశ్రమ వద్ద విధుల్లోకి వెళ్లేందుకు బారులు తీరిన కార్మికులు

ఉపాధికి అడ్డా.. జిన్నారం గడ్డ

● పరిశ్రమలలో లేబర్, అన్‌స్కిల్డ్ ఉద్యోగాలు
● ఆసక్తి చూపని రాష్ట్ర యువత
● బీహార్, ఒడిశా. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, అస్సాం నుంచి వలసలు
● ఆయా రాష్ట్రాలవారి నివాసాలతో మినీ ఇండియాను తలపిస్తున్న మండలం

జిన్నారం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిన్నారం మండలం దేశ యువత ఉపాధి కేంద్రంగా మారుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో మారుతున్న జీవన విధానం, ఆర్థిక వనరులతో పారిశ్రామిక రంగంలో సాధారణ కార్మికుల ఉద్యోగాలపై స్థానిక యువత ఆసక్తి చూపడం లేదు. ఉన్నత చదవులు, సొంత వ్యాపారాలు, ఐటీ వంటి ఉపాధి రంగాలకు ప్రాధాన్యం ఇవ్వటంతో పరిశ్రమలలో స్థానికుల చేరికలు భారీగా తగ్గాయి. దీంతో ఉమ్మడి జిన్నారం మండలానికి వివిధ రాష్ట్రాలకు చెందినవారు వేల మంది ఉపాధి కోసం ఇక్కడకు వచ్చి నివాసాలు ఏర్పాటు చేసుకోవంతో మినీ ఇండియాను తలపిస్తున్నది.

90 వేల మందికి పైగా..

మండల వ్యాప్తంగా ఉన్న 400 పరిశ్రమలు ఉండగా, బొల్లారం, గడ్డపోతారం, కాజీపల్లి, కొడకంచి, దోమడుగు, గుమ్మడిదల, మంబాపూర్, అన్నారం ప్రాంతాల్లో సుమారు 90 వేల మంది ఇతర రాష్ట్రాల కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఎక్కువగా రసాయన పరిశ్రమలలో అన్ స్కిల్డ్, లేబర్, సివిల్ తదితర పనుల నిర్వహణ కోసం ఆయా పరిశ్రమలకు చెందిన హెచ్ఆర్ విభాగాలు, లేబర్ కాంట్రాక్టులు బీహార్, ఒడిశా. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, అస్సాం తదితర రాష్ట్రాల యువతను ఇక్కడకు తరలిస్తున్నారు. ఇటీవల కొన్ని పరిశ్రమలు వారిని రప్పించేందుకు ఏజెంట్లను సైతం ఏర్పాటు చేసుకుంటున్నారు. రెండేళ్లలో పారిశ్రామిక వాడలకు 3 వేలకు పైగా ఇతర రాష్ట్రాలవారు వచ్చినట్లు తెలుస్తున్నది.

మినీ ఇండియాగా పారిశ్రామిక వాడలు..

మండలంలో ఉన్న పారిశ్రామిక వాడలు మినీ ఇండియాగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉపాధి కోసం వచ్చి అద్దెకు ఉంటున్న వారి సంఖ్య 80 శాతం ఉండగా, మరో 20 శాతం సొంత నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. వీరు తమ ప్రాంత జీవన విధానం, పండగలు, వివాహ తదితర వేడుకలు, ఇతర సాసంస్కృతిక కార్యక్రమాలను స్థానికులు ఆసక్తిగా తిలకిస్తారు. బొల్లారంలో ఒడిస్సా వాసులు 3 కోట్ల వ్యయంతో సూర్య భగవాన్ దేవాలయం నిర్మించగా, ఏటా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గడ్డపోతారం, కాజీపల్లి, బొంతపల్లి, గుమ్మడిదల ప్రాంతాల్లోనూ తరచూ ఇతర రాష్ట్రాల కార్మికుల కుటుంబ సభ్యులు తమ సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

లైఫ్ సర్టిఫికెట్ సమర్పించకపోతే పెన్షన్ నిలుపుదల

పటాన్‌చెరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పెన్షన్ చెల్లింపులు నిరంతరం కొనసాగేందుకు తక్షణం లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని పటాన్‌చెరు పీఎఫ్ కమిషనర్ శ్రీదేవి పేర్కొన్నారు. పటాన్‌చెరు పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో సుమారు ఐదేళ్లుగా జీవిత ధృవీకరణ పత్రాలు దాఖలు చేయని 885మందికి పెన్షన్ రావడం లేదని గుర్తించామన్నారు. ధృవీకరణ పత్రాలతో కార్యాలయాన్ని సంప్రదిస్తే తక్షణం ఎలాంటి జాప్యం లేకుండా పీఎఫ్ సమస్యలను పరిష్కరించి పెన్షన్‌ను పునరుద్ధరిస్తామన్నారు. పాత పెన్షన్ బకాయిలూ చెల్లిస్తామన్నారు. సందేహాల నివృత్తి కోసం పటాన్‌చెరులోని పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయాన్ని నేరుగా సందర్శించాలని, లేదా 08455-246124, 285134 నెంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

పాపన్నపేట సబ్ డివిజన్ ఏడీఈగా శ్రీనివాస్ బాధ్యతలు



పాపన్నపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పాపన్నపేట సబ్ డివిజన్ విద్యుత్ శాఖ ఏడీఈ గా శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బంజారాహిల్స్ కార్యాలయంలో పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇది వరకు ఇక్కడ ఇన్‌చార్జి ఏడీఈ గా పనిచేసిన మోహన్ బాబు మెదక్‌కు బదిలీ అయ్యారు.

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఖేడ్ ఆర్టీసీ డీపోలో ఈ నెల 21న మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు, ప్రజలు సమస్యలను వివరించడంతో పాటు మెరుగైన సూచనలు, సలహాలను ఇవ్వడానికి గాను 9063417161 నెంబరు ఫోన్ చేసి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రామాయంపేటలో కార్మికుల నిరసన

పారిశుధ్య కార్మికుల సమ్మె

రామాయంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృత సమస్యల సాధనకై పారిశుధ్య కార్మికులు సమ్మెకు దిగారు. ముందుగానే ఇచ్చిన రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా గురువారం పనులు మానేసి రామాయంపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయింది. ఆరు నెలలుగా పీఎఫ్ బకాయిలు చెల్లించక జీతాలు సైతం సక్రమంగా ఇవ్వనందునే తాము ఆందోళన బాట పట్టానని కార్మికులు తెలిపారు. సబ్బులు, నూనెను సైతం పంపిణీ చేయడం లేదని ఆరోపించారు. సమస్యలు తీర్చే వరకు సమ్మె విరమించరని సీపీఎం జిల్లా కార్యదర్శి బాలమణి కార్మికుల పక్షాన తెలిపారు.

అల్లీనగర్‌లో ప్రభుత్వ భూముల పరిశీలన



స్థానికులతో మాట్లాడుతున్న ఆర్డీవో రవీందర్‌రెడ్డి

జిన్నారం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గడ్డపోతారం పరిధిలోని అల్లీనగర్ 27 సర్వే నంబరులోని భూములను టీజీఐఐసీ కోసం కేటాయించాలనే ప్రతిపాదనల మేరకు ఆర్డీవో రవీందర్‌రెడ్డి పరిశీలించారు. గురువారం ఆయన తహసీల్దార్ భిక్షపతి, రెవెన్యూ అధికారులతో కలిసి స్థల పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు. తమ ఆధీనంలో భూములను ఇతరులకు కేటాయించవద్దని ఆర్డీవోకు స్థానికులు విజ్ఞప్తి చేశారు. ఆయా భూములలో పంటల సాగు లేదని, ఇవి ప్రభుత్వ భూములేనని అధికారులు స్పష్టం చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న భూముల పూర్తి విస్తీర్ణంపై ఆర్డీవో వివరాలు సేకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, ఆర్ఐ జయప్రకాష్‌నారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'నైపుణ్యాల పెంపుతోనే ఆర్థిక స్థిరత్వం'

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాల పెంపు ద్వారానే ఆర్థిక స్థిరత్వం ఉంటుందని కార్పొరేట్ ట్రైనర్ మల్లేశం తెలిపారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో కాలేజ్ టు కార్పొరేట్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక మాధ్యమాలను జీవిత లక్ష్యాల అభివృద్ధికి మాత్రమే ఉపయోగించుకోవాలని వాటి మాయలో పడి తమ జీవితాలను వృథా చేసుకోరాదని హితవుపలికారు. అనంతరం సనాతన అనాలటిక్స్ సీఈవో రంగనాథ్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

కల్హేర్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నికల ప్రత్యేక అధికారి, జిల్లా హార్టికల్చర్ అధికారి పురుషోత్తం తెలిపారు. గురువారం మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని ఉన్నత పాఠశాలలో నిర్వహించబోయే ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించి ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట సిర్గాపూర్ తహసీల్దార్ ఉమాశంకర్, మండల విద్యాధికారి శ్రీనివాస్ ఉన్నారు.

1.08 కోటి రుద్రాక్షలతో మహాశివలింగం

● శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి



మాట్లాడుతున్న మహేశ్వర శర్మ సిద్ధాంతి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 26న 1.08 కోటి రుద్రాక్షలతో మహాశివలింగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని ఆశ్రమంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శివలింగం 18.50 అడుగులు ఉంటుందని పేర్కొన్నారు. 23 రుద్రాక్షలతో తయారుచేసి ఆవిష్కరిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో విద్యాపీఠం సభ్యులు తోపాజి అనంతకిషన్, ప్రశాంత్‌కుమార్, సంజయ్‌కుమార్, కృష్ణమూర్తి, రాము, విఠల్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ సమావేశాలు నిర్వహించాలి

వెల్దుర్తి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ) ద్వితీయ సమావేశాలు నిర్వహించాలని ఏపీఎం శంకరయ్య అన్నారు. గురువారం వెల్దుర్తిలో మండల సమైక్య అధ్యక్షురాలు నవనీత అధ్యక్షతన వీవోఏలు, గ్రామ సంఘం ఆఫీస్ బేరర్లు, గ్రామ సంఘం సబ్ కమిటీ సభ్యులకు ఆరోగ్యం, పోషణ, పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, జెండర్ అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఏపీఎం శంకరయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి మాట్లాడుతూ పిల్లల పోషణ, రక్తహీనత, 1000 రోజుల ప్రాముఖ్యత, పిల్లల పోషణకు పాటించే పద్ధతులను వివరించారు.

క్రైం కార్నర్

దొంగల హల్‌చల్

కంది, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రమైన కందిలో గురువారం తెల్లవారుజామున దొంగలు హల్‌చల్ చేశారు. కొత్త కందిలో నివాసముండే కొసిగే శ్యామల బుధవారం రాత్రి ఊరికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి ఇళ్లంతా చిందరవందరం చేశారు. బీరువాను పగలగొట్టి అందులోని ఇంటి పత్రాలు, అరతులం బంగారు చెవికమ్మలు, 16 తులాల వెండి పట్టీలు, రూ.20 వేల నగదు అపహరించారు. గురువారం ఉదయన్నే ఇంటికొచ్చిన ఇంటిలో దొంగలు పడ్డట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనపూర్‌లో చోరీ

తూప్రాన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం ఘనపూర్‌లో పట్టపగలు చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన మల్రి మహేశ్ వ్యవసాయం చేస్తు జీవనం సాగిస్తున్నారు. రోజుమాదిరిగా నే బుధవారం పిల్లలు కళాశాలకు వెళ్లిపోగా, మహేశ్, భార్య సంతోష ఇంటికి తాళం వేసి తాళంచెవి కిటికిలో పెట్టి పొలం పనికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి డబ్బులు అవసరముండగా బీరువాలో చూడగా రూ.22వేల నగదు, 150 తులాల వెండి అభరణాలు, 2 తులాల బంగారు అభరణాలు కనిపించలేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, విచారణ చేస్తున్నారు.

నాగులపల్లిలో..

తూప్రాన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం నాగులపల్లిలో వెండి, నగదు చోరీ జరగగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. నాగులపల్లి గ్రామానికి చెందిన కొండ శివలక్ష్మి ఈ నెల 16న ఇంటికి తాళం వేసి ఊరులోనే ఉన్న అక్క ఇంటికి వెళ్లి అక్కడే ఉండిపోయింది. మధ్యాహ్నం గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న 50 తులాల వెండి అభరణాలు, రూ. 5వేల నగదు చోరీ చేశారు. కాగా, బాధితురాలు గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నలుగురు అరెస్ట్

కోహీర్, ఫిబ్రవరి 20: (ఆంధ్రజ్యోతి): నలుగురు అనుమానితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు కోహీర్ ఎస్ఐ గోపతి సతీష్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోహీర్ మండలంలోని కవెల్లి చౌరస్తా వద్ద గురువారం ఉదయం 5 గంటలకు పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ ఆటోలో చాకు, ఐరన్‌రాడు, కట్టెలతో పట్టుబడిన హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అయూబ్, మహ్మద్ ఖురేషి, గౌస్‌ఖాన్, అమీర్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. వారు పొంతనలేని సమాధానం చెప్పడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

డంపుయార్డుపై నిరసనల వెల్లువ



గుమ్మడిదలలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష

గుమ్మడిదల/నర్సాపూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్యారా నగర్‌లో డంపుయార్డు పనులు నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. గురువారం గుమ్మడిదలలో వర్తక సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వీరికి సంఘీభావంగా గ్రామంలోని వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ చేశారు. నల్లవల్లి, కొత్తపల్లి గ్రామంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తూ ఆందోళనకారులు దీక్ష ఆవరణలో వంట వార్పు నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన సీపీఎం ధర్నాకు సంఘీభావం తెలుపుతూ గుమ్మడిదల జేఏసీ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. అలాగే నర్సాపూర్‌లో జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష గురువారం నాల్గవరోజుకు చేరింది. వెంటనే డంపు యార్డు ఏర్పాటును రద్దు చేయాలని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు ఎ.మల్లేశం, కాలేక్ డిమాండు చేశారు. నర్సాపూర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండు టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ డంపుయార్డు వల్ల ఈ ప్రాంతంలోని అనేక గ్రామాల ప్రజలపై అన్ని విధాల ప్రభావం చూపుతుందని అన్నారు. ఈ డంపుయార్డు ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు జనార్దన్,నాగేందర్, శేఖర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

● మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



సిబ్బంది వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది నిర్వహిస్తున్న విధులను ఎస్ఐ మురళి ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పీఎస్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని కలిగించాలన్నారు. నేర ప్రవృత్తి కలిగినవారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. డయల్ 100 కాల్స్ వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ రాజశేఖర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి : డీఈవో

చిలప్‌చెడ్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరిక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో రాధా కిషన్ సూచించారు. గురువారం మండల పరిధిలోని సోమక్కపేట, ఫైజాబాద్, చిట్కుల్ తదితర ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతంగా పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో విఠల్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



సోమక్కపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూచనలు చేస్తున్న డిఈవో రాధాకిషన్

వరి కోతలపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న జిల్లా అధికారి వినయ్‌కుమార్

నర్సాపూర్/చిలప్‌చెడ్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పంట పూర్తిగా పక్వానికి వచ్చాకే కోతలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్, చిలప్‌చెడ్ రైతువేదికల్లో పంటకోత, ధాన్యం కొనగోలులోపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోత సమయంలో హార్వెస్టర్ బ్లోవర్ ఆన్‌లో ఉంచితే తాలు, చెత్త వంటి పదార్థాలు ధాన్యం నుంచి వేరు చేయవచ్చన్నారు. ఏడీఏ సంధ్యరాణి, ఏవో దీపిక, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

గీతం అధ్యాపకుడికి డాక్టరేట్



రవి హనుమంతు

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని టెక్నాలజీ విభాగం పరిశోధక విద్యార్థి, మెకానికల్ ఇంజనీరింగ్ అధ్యాపకుడు రవి హనుమంతు డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'వివిధ ఆపరేటింగ్ పారామితులలో టెర్నరీ ఇంధనంతో ఇంధనంగా ఉన్న ఆర్ సీసీఐ ఇంజిన్ ప్రవర్తన, వ్యాయామ విశ్లేషణ మెరుగుదల' అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించగా డాక్టరేట్ లభించింది. గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు రవి హనుమంతును అభినందించారు.

మార్చి 18న బ్రాహ్మణ సంఘం జిల్లా ఎన్నికలు

● షెడ్యూల్ ప్రకటించిన జిల్లా ఎన్నికల అధికారి

తూప్రాన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా బ్రాహ్మణ సంఘం ఎన్నికలు మార్చి 18న తూప్రాన్ పట్టణంలో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి సోమయాజుల రవీంద్రశర్మ, సహాయ ఎన్నికల అధికారులు శాస్త్రుల మధుశ్రీశర్మ, డీజీ శ్రీనివాస్ శర్మలు తెలిపారు. గురువారం తూప్రాన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, తూప్రాన్, మెదక్, నర్సాపూర్ డివిజన్లకు సంబంధించిన ఓటరు జాబితాలను ఆయా డివిజన్ అధ్యక్షులకు అందజేసినట్లు వివరించారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి

పుల్‌కల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సేవాలాల్ మహారాజ్ జయంతిని దేశ వ్యాప్తంగా సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు గురువారం ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు.

ఏడుపాయల జాతరకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

● అధికారులకు మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశం

పాపన్నపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏడుపాయల పుణ్యక్షేత్రంలో నిర్వహించే మహాజాతరకు అన్నీ ఏర్పాట్లు చేయాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. ఈ నెల 26 నుంచి 28 వరకు జరిగే జాతర దృష్ట్యా గురువారం ఆయన ఏడుపాయల ఆలయాన్ని సందర్శించి వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు సరిపడ సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. తాత్కాలిక టాయిలెట్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, వృద్ధులు, నడవలేని వారికి ఇబ్బంది కలుగకుండా పార్కింగ్ నుండి రాజగోపురం వరకు బ్యాటరీ ఆటోలు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయం వద్ద శాశ్వత వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. అంతకుముందు ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులు

రైతులకు మెరుగైన పరిహారం

● నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ రాజు

జహీరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నిమ్జ్ రైతులు నష్టపోకుండా మెరుగైన పరిహారం ఇస్తామని నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ రాజు అన్నారు. గురువారం పట్టణంలోని నిమ్జ్ కార్యాలయంలో న్యాల్‌కల్ మండలంలోని వడ్డీ, మామిడిగి తదితర ప్రాంతాలకు చెందిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంతవరకు రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. భూసేకరణపై రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. మార్కెట్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తమకు పరిహారాన్ని ఇవ్వాలని పలువురు రైతులు కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని సాహితి ఆస్పత్రిలో ఈ నెల 21న ఉచిత న్యూరో, ఆర్థో, డయాబెటిక్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ రాముసాహితీ ఒక ప్రకటనలో తెలిపారు. నరాలకు సంబంధించిన సమస్యలు, ఆర్థో, బీపీ, షుగర్ సమస్యలున్న వారు ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

127 మందికి కంటి పరీక్షలు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ సత్యసాయి మందిరంలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించిందని జిల్లా సత్యసాయి సేవా సమితి కన్వీనర్ శంకరప్ప తెలిపారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో 127 మందికి పరీక్షలు జరుపగా, 51 మందిని క్యాట్రాక్ట్ ఆపరేషన్‌ల కోసం ఎంపిక చేశారన్నారు. వీరిలో 48 మందిని ఆపరేషన్ కోసం నానక్‌రాంగూడలోని శంకర కంటి ఆసుపత్రికి తరలించామన్నారు.

బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి

నిజాంపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. నిజాంపేట మండల కేంద్రంలో గురువారం బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు నిర్వహిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. రానున్న బడ్జెట్లోనైనా ఎన్నికల హామీ నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధక్షుడు సంజీవ్, ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాస్, కొమ్మట బాబు తదితరులు ఉన్నారు

ఓటరు స్లిప్పుల అందజేత

నిజాంపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మండల ఆర్ఐ ఈమద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో గురువారం బీఎల్‌వోలకు ఓటరు స్లిప్పులను అందజేశారు.

ముందస్తు అరెస్టు

తూప్రాన్/చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చలో విద్యుత్ సౌధ పిలుపు నేపథ్యంలో విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులు, జేఏసీ నాయకులను గురువారం ముందస్తు అరెస్టులు చేశారు. ఆర్టిజన్ ఉద్యోగులను కన్వర్షన్ (రెగ్యులర్) చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టిజన్ ఉద్యోగుల జేఏసీ ఇచ్చిన పిలుపు నేపథ్యంలో తూప్రాన్ పోలీసులు టీపీఏసీ జిల్లా జేఏసీ చైర్మన్ బంగారిగాళ్ల స్వామిని ముందస్తు అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అలాగే చిన్నశంకరంపేట మండలంలోని విద్యుత్ ఆర్టిజన్ కార్మికులను గురువారం పోలీసులు ముందస్తు హౌజ్ అరెస్టులు చేశారు.